క్లుప్తంగా

సత్తెమ్మ తల్లిని దర్శించుకున్న కన్నబాబు



అమ్మవారిని దర్శించుకుంటున్న కన్నబాబు

కాకినాడ రూరల్: రేపూరులో గ్రామ దేవత సత్తెమ్మ తల్లిని సిట్టింగ్ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు ఆదివారం దర్శించుకున్నారు. గ్రామ దేవత సత్తెమ్మ జాతర సందర్భంగా ఆలయంలో ఆయన పూజలు చేశారు. ఎంపీటీసీ మామిడాల నాగచక్రం, టి.ధర్మరాజు పాల్గొన్నారు.

జిల్లాలో నమోదైన పోస్టల్ బ్యాలెట్ 4,520

కాకినాడ సిటీ: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లాలో 4,520 మంది పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటును ఆదివారం వినియోగించుకున్నారు. జిల్లాలో 7,944 మంది అధికారులు ఎన్నికల విధుల్లో ఉండగా, పోస్టల్ ఓటు నమోదు చేసుకోవాల్సి ఉంది. తునిలో 565 మంది, ప్రత్తిపాడులో 335, పిఠాపురంలో 764, కాకినాడ రూరల్‌లో 1,207, పెద్దాపురంలో 510, కాకినాడ సిటీలో 771, జగ్గంపేటలో 346 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నివాస్ తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్‌లో 819 ఓట్లు

కాకినాడ: ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది కోసం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్‌లో ఆదివారం 819 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు ఆదివారం పర్యవేక్షించారు. ఆర్వో వెంకటరావు మాట్లాడుతూ సోమవారమూ ఓటు హక్కు వినియోగించుకుంటారన్నారు. ఇతర జిల్లాల్లో ఓటు ఉండి, ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు ఇదే ప్రాంగణంలో 7, 8 తేదీల్లో ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు.

ఐ బ్యాంక్‌కు రూ.లక్ష వితరణ



ఐబ్యాంక్‌కు విరాళం అందిస్తున్న దంపతులు

బాలాజీచెరువు: ఉభయ గోదావరి జిల్లాల్లో అంధులకు కంటిచూపు ప్రసాదిస్తున్న డాక్టర్ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు ఆదివారం డేగల వీరభద్రరావు, మహాలక్ష్మి దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. ఐ బ్యాంక్ చైర్మన్ దామెర విజయలక్ష్మికి ఈ చెక్కు అందజేశారు. ఐ బ్యాంక్ కార్యదర్శి డాక్టర్ బాదం బాలకృష్ణ, ట్రస్టీలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాకినాడ: కాకినాడ అన్నమ్మగాటి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం ఏడు నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో డీఈ జి.ప్రసాద్ తెలిపారు. అభివృద్ధి పనుల దృష్ట్యా ఆయా ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ముంచెత్తిన చెరువు నీరు

కరప: ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల రక్షిత మంచినీటి చెరువు నిండిపోయి, పొర్లి ప్రవహించింది. దీంతో మార్కెట్ వద్ద, మండల కార్యాలయం ఆవరణలో నీరు నిలిచిపోయింది. కరపలో సామూహిక రక్షిత మంచినీటి చెరువు నుంచి 8 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తారు. పెనుగుదురులోని కేఎంజే కెనాల్ నుంచి మోటార్లతో నీటిని తోడి, ఈ చెరువుకు మళ్లిస్తారు. నీటిని క్లోరినేషన్ చేసి, పలు గ్రామాలకు రక్షిత మంచినీరు అందిస్తారు. ఆదివారం ఉదయం 5.30కు పెనుగుదురులో మోటార్ ఆన్ చేసి నీటిని తోడటం ప్రారంభించారు. చెరువు నిండాక మోటార్‌ను ఆపాల్సిన సిబ్బంది పట్టించుకోలేదు. దీంతో చెరువు నుంచి నీరు పొర్లి ప్రవహించింది.అటుగా వెళ్లిన ఎమ్మెల్యే కన్నబాబు.. అధికారులకు ఫోన్ చేసి చెప్పడంతో, సిబ్బంది మోటార్లను ఆపేశారు.

ప్రతిభకు గీటు.. ఉపాధికి రూటు

- స్కిల్ హబ్‌తో నైపుణ్య శిక్షణ
- కాకినాడ అర్బన్‌కు జీపీటీ, రూరల్‌కు ప్రభుత్వ ఐటీఐ
- నైపుణ్యాలతోనే కొత్త అవకాశాలు
- 18 నెలల్లో 518 మందికి శిక్షణ
- ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు



జేఎన్‌టీయూకేలో స్కిల్ కళాశాల



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): యువతలో నైపుణ్యం మరింత మెరుగుపరిచి, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేలా ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో స్కిల్‌హబ్‌కు 2022లో శ్రీకారం చుట్టారు. వాటిని నియోజకవర్గాల వారీగా నెలకొల్పారు. ఒక్కో కేంద్రానికి రూ.15 లక్షల విలువైన టెలివిజన్లు, సీసీ కెమెరాలు, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు సమకూర్చారు. ఆన్‌లైన్ ద్వారా
ఎంఎస్ ఆఫీస్–86, జావా, పైథాన్ బేసిక్స్, పైథాన్ ఫర్ డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, క్లౌడ్ ఆర్కిటెక్ట్, డిజిటల్ మార్కెంటింగ్, సైబర్ సెక్యూరిటీ, ట్యాలీ విత్ జీఎస్టీ, ఆండ్రాయిడ్ వంటి కోర్సుల్లో 15 నుంచి 45 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. అనంతరం వీరికి పరీక్షలు నిర్వహించి, సర్టిఫికెట్లు అందజేయగా, దాదాపు రెండు వేల మంది సద్వినియోగం చేసుకున్నారు. జీపీటీలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, టైలరింగ్, కోర్సులపై శిక్షణ ఇవ్వగా, రూరల్‌కు సంబంధించి ప్రభుత్వ ఐటీఐలో సీఆర్ఎం డొమెస్టిక్ నాన్ వాయిస్, ఏసీ మెకానిక్ వంటి కోర్సులకు శిక్షణ ఇచ్చారు.

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా..

జిల్లాలో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ శ్రీకారం చుట్టింది..కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో హిటాచి వంటి కంపెనీలు విద్యార్థులకు షార్ట్‌టెర్మ్ కోర్సులు నిర్వహించి, ఆసక్తి ఉన్నవారికి ఉద్యోగ అవకాశాలు కల్పించింది. అలాగే జిల్లాలో ఉన్న పలు ప్రైవేట్ సంస్థలు ఐటీఐ విద్యార్థులకు ప్రత్యేకించి శిక్షణ ఇవ్వడానికి ముందుకొచ్చాయి.

నియోజకవర్గం	కళాశాల	బ్యాచ్‌లు	శిక్షణ పొందిన విద్యార్థులు
కాకినాడ సిటీ	జీపీటీ కళాశాల	06	146
కాకినాడ రూరల్	ప్రభుత్వ ఐటీఐ	14	253
స్కిల్ కళాశాల	జేఎన్‌టీయూకే	04	118

యువతకు మంచి అవకాశం



పదో తరగతి నుంచి పీజీ పూర్తిచేసిన విద్యార్థులకు ఉద్యోగం కల్పించాలన్న ఆశయంతో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ పనిచేస్తోంది. జిల్లాకు చెందిన యువతీయువకులకు, మహిళలకు అనేక అంశాలపై శిక్షణ ఇస్తున్నాం. డిమాండ్ ఉన్న కోర్సుల్లో నైపుణ్యం పెంచి వారికి ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తున్నాం. నియోజకవర్గానికి ఒక స్కిల్ హబ్‌లో భాగంగా కాకినాడ సిటీ, కాకినాడ రూరల్ నియోజవర్గాలకు సంబంధించి ఏర్పాటు చేశాం. బీటెక్ ఉత్తీర్ణులైన వారికి జేఎన్‌టీయూకేలో ఉచిత వసతి, శిక్షణ కల్పిస్తున్నాం.
– డి.హరిశేషు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి, కాకినాడ

ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియ ప్రారంభం

పర్యవేక్షించిన పరిశీలకులు, ఆర్వో



ప్రక్రియను పర్యవేక్షిస్తున్న పరిశీలకులు ఎస్ గణేష్, ఆర్వో జె.వెంకటరావు

కాకినాడ: కాకినాడ సిటీ నియోజకవర్గంలో ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. రానున్న ఎన్నికలకు ఈవీఎంలను సిద్ధం చేసే క్రమంలో భాగంగా బ్యాలెట్ పత్రాలు, అభ్యర్థులకు కేటాయించిన గుర్తులను ఈవీఎంలలో నిక్షిప్తం చేసే కమిషనింగ్ ప్రక్రియను స్థానిక మెక్లారిన్ గ్రౌండ్స్ ఆవరణలోని ఓటర్ల సామగ్రి పంపిణీ కేంద్రంలో చేపట్టారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.గణేష్, సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు పర్యవేక్షించారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా కమిషనింగ్ ప్రక్రియను సజావుగా జరిగేలా అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందికి సూచనలు ఇచ్చారు. సాధ్యమైనంత త్వరగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. వీరి వెంట డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్లు నాయుడు, పవన్, ఇతర ఎన్నికల అధికారులు ఉన్నారు.

అందరి సంక్షేమమే జగన్ ధ్యేయం

- కాకినాడ రూరల్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- సిరిగలపల్లిలంక, గురజనాపల్లిల్లో ప్రచారం



సిరిగలపల్లిలంకలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: సకల జనుల సంక్షేమమే ధ్యేయంగా ఐదేళ్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని, సంక్షేమ సారథి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఉదయం వేములవాడ శివారు సిరిగలపల్లిలంకలో గ్రామ కమిటీ అధ్యక్షుడు విత్తనాల శ్రీను, గుత్తుల సత్తిబాబు తదితర నాయకులతో, రాత్రి గురజనాపల్లిలో పబ్బినీడి పాపారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు జొన్నలగడ్డ కృష్ణమూర్తి, సర్పంచ్ అనసూరి శ్రీనివాసరావు, మామిడాల బాబీ, మాజీ సర్పంచ్ బొడ్డు సత్యప్రసన్న, మాజీ ఎంపీటీసీ మామిడాల పాపారావు, మామిడాల గౌతమ్‌తేజ, పబ్బినీడి వీరబాబు తదితర నాయకులతో ఇంటింటి ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కన్నబాబు ఓటర్లను కోరారు. ఆయనకు మహిళలు హారతులిచ్చి, పూలవర్షం కురుపిస్తూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహంతో గురజనాపల్లిలో సాల్ట్ భూములు కొనుగోలు చేసి, 700 మందికి గ్రామంలోనే ఇళ్ల పట్టాలు ఇచ్చినట్టు గుర్తుచేశారు. టీడీపీ నాయకులు నిర్లక్ష్యం చేసిన అడవిపూడి కెళ్లే రోడ్డును ఆధునీకరించామని, గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, కమ్యూనిటీ హాళ్లు, రోడ్లు, డ్రైన్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు, అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేశామని వివరించారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నా, అభివృద్ధి సాధించాలన్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని, ఆయనకు అండగా నిలబడి ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండుసార్లు బటన్‌నొక్కి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా సునీల్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, వేములవాడ సర్పంచ్ కమిడి మంగాదేవి, పార్టీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ కె.సీతామహాలక్ష్మి, వేములవాడ పీఏసీఎస్ చైర్మన్ బండే తాతాజీ వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

శెట్టిబలిజలకు అన్ని విధాలా అండ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి. చిత్రంలో ఎంపీ అభ్యర్థి సునీల్

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సునీల్, ద్వారంపూడి

కాకినాడ: శెట్టిబలిజ సామాజికవర్గానికి అన్నివిధాలా అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. స్థానిక డి కన్వెన్షన్‌లో కాకినాడ సిటీ నియోజకవర్గ శెట్టిబలిజ సామాజిక వర్గీయుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఉభయ గోదావరి జిల్లాల శెట్టిబలిజ, గౌడ సంక్షేమ సంఘ అధ్యక్షుడు రెడ్డి రామపల్లంరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చలమలశెట్టి, ద్వారంపూడి మాట్లాడుతూ టీడీపీ శెట్టిబలిజ సామాజికవర్గాన్ని ఓటు బ్యాంక్‌గా మాత్రమే వాడుకుందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తన హయాంలో పెద్దపీట వేసిందన్నారు. ముఖ్యంగా శెట్టిబలిజలకు ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల కేటాయింపు, మంత్రి పదవులు, కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ హోదాలు కల్పించిందన్నారు. రాజకీయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారన్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ మాట్లాడుతూ జిల్లా కేంద్రం కాకినాడలో శెట్టిబలిజల కమ్యూనిటీ నిర్మాణం కోసం సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి 640 గజాల స్థలాన్ని కూడా కేటాయించారన్నారు. కాకినాడలో శెట్టిబలిజలకు అన్ని విధాలా మద్దతుగా నిలిచిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సునీల్, ద్వారంపూడికి శెట్టిబలిజ సామాజిక వర్గీయులంతా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాకినాడ పార్లమెంట్ పరిశీలకులు గుబ్బల తులసీకుమార్, శెట్టిబలిజ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, నాయకులు పితాని నూకరాజు, పెద్ద సంఖ్యలో శెట్టిబలిజ సామాజికవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో కాకినాడను అగ్రగామిని చేస్తా

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ద్వారంపూడి



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపిస్తే కాకినాడ నగరాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతానని వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. రాష్ట్రంలోనే నంబర్ వన్ సిటీగా తీర్చిదిద్దడమే తన ప్రధాన కర్తవ్యమన్నారు. ఆదివారం ఆయన స్థానిక రామకృష్ణారావుపేట ప్రాంతంలోని నీలాపువారివీధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ రోకళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నాయకులు పైలా రామకృష్ణ కుమారుడు పైలా భాస్కర్, నాయిని కృష్ణ, బొరుసు శేఖర్, ఏసుతో పాటు, సుమారు 50 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో సంతృప్తికరమైన సేవలు అందించానన్నారు. గతంలో ఏ ప్రజాప్రతినిధి చేయనంతగా అన్ని ప్రాంతాలను సమాన దృష్టితో అభివృద్ధి చేశానన్నారు. మరోసారి ఎమ్మెల్యేగా అవకాశమిస్తే రాష్ట్రంలోనే ఆదర్శ నగరంగా కాకినాడను తీర్చిదిద్దాలన్నదే తన అభిమతమన్నారు. అర్హతే ప్రాతిపదికగా ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ ఫలాలు అందించామన్నారు. నగరంలో 94 వేల నివాసాలు ఉంటే, 82 వేల కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించామన్నారు. చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించి, ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ రెహ్మాన్‌ఖాన్, జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షుడు బాషా, నూకాలమ్మగుడి చైర్మన్ కొయ్యా సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో టీడీపీ నేతల చేరిక



సిరిగలపల్లిలంకలో వైఎస్సార్ సీపీలోకి చేరిన వారికి పార్టీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు



గురజనాపల్లిలో పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న కన్నబాబు

కరప: కాకినాడ రూరల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు ఎన్నికల ప్రచారంలో ఆదివారం పలువురు టీడీపీ సీనియర్ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీ వైఖరి నచ్చక, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే కన్నబాబు అభివృద్ధి పనులకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరినట్టు వారు పేర్కొన్నారు. సిరిగలపల్లిలంక వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు విత్తనాల శ్రీను, గుత్తుల సత్తిబాబు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు గుత్తుల తాతారావు, గుత్తుల గోవిందు పార్టీలో చేరారు. అలాగే వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు ఆధ్వర్యంలో వలసపాకలకు చెందిన టీడీపీ నేత వాసంశెట్టి సత్తిబాబు పార్టీలోకి వచ్చారు. గురజనాపల్లిలో గ్రామ కమిటీ అధ్యక్షుడు జొన్నలగడ్డ కృష్ణమూర్తి, పబ్బినీడి పాపారావు ఆధ్వర్యంలో టీడీపీ నేతలు పబ్బినీడి వీరబాబు, జ్యోతుల వీరబాబు, తలాటం శ్రీను, తట్టగల్ల దుర్గబాబు, వి.రాంబాబు, తూరంగి సత్యనారాయణ, రామచంద్రరావు, కొప్పుల మణికంఠ, తూరంగి లక్ష్మణ్, తలాటం వీరభద్రరావు, పసగొడుగుల రామకృష్ణ తదితరులు 50 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే కన్నబాబు పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు పాల్గొన్నారు.

ద్వారంపూడితోనే స్మార్ట్ సిటీ ప్రగతి

ఎమ్మెల్యే భార్య మహాలక్ష్మి ప్రచారం



ఎన్నికల ప్రచారంలో ద్వారంపూడి భార్య మహాలక్ష్మి



తండ్రికి మద్దతుగా ప్రచారం చేస్తున్న కుమార్తె డాక్టర్ అంజని

కాకినాడ: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాకినాడ స్మార్ట్‌సిటీ మరింత అభివృద్ధి చెందాలంటే సిట్టింగ్ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డితోనే సాధ్యమని ఆయన భార్య ద్వారంపూడి మహాలక్ష్మి అన్నారు. ఆదివారం ఆమె 44వ డివిజన్ కనకమహాలక్ష్మి గుడి, గౌరీశంకర్‌వీధి, ఇంటి సత్యనారాయణవీధి, సాయిబాబావీధి, కృష్ణాలయం వీధి ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. అడుగడుగునా ఆమెకు పూలమాల, హారతులిచ్చి స్వాగతం పలికారు. గడచిన ఐదేళ్లలో భర్త ద్వారంపూడి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ఆమె కరపత్రాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ కాకినాడ నగరంలో పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో దాదాపు 30 వేల మందికి ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చారన్నారు. ప్రజలు మళ్లీ గెలిపిస్తే 18 నెలల్లోనే స్థలాలు పొందిన ప్రతి ఒక్కరి సొంతింటి కలను సాకారం చేస్తారని చెప్పారు.

కుమార్తె ప్రచారం

ఎమ్మెల్యే ద్వారంపూడి కుమార్తె డాక్టర్ అంజని ఆదివారం 33వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇబ్రహీంవీధి, కామేశ్వరనగర్, పులివారివీధి, సాడివారివీధి ప్రాంతాల్లో ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. గత ఐదేళ్లలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, సేవలందించిన ద్వారంపూడికి మరో విజయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. కాకినాడ నగరంలో రోడ్లు, డ్రైన్లు, కల్యాణ మండపాలు, ఫ్లైఓవర్లతో సహా అనేక అభివృద్ధి పనులను చిత్తశుద్ధితో పూర్తి చేశారని చెప్పారు. 2019 తర్వాత జరిగిన అభివృద్ధిని గుర్తించి తండ్రి ద్వారంపూడిని మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.ఆమె వెంట రాష్ట్ర రైసుమిల్లర్ల సంఘ అధ్యక్షుడు వీరభద్రారెడ్డి సతీమణి మాధురి, మల్లిపాముల అనసూయ, డివిజన్ ఇన్‌చార్జి బోరా వెంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ పోలిశెట్టి పద్మావతి, నాయకులు చోటు, కట్టా మంగరాజు, సరగడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం హోమ్ ఓటింగ్



కాకినాడ రూరల్‌లో హోమ్ ఓటింగ్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఓ ఇట్ల కిశోర్



హోమ్ ఓటింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధుడు

కాకినాడ రూరల్: నియోజకవర్గంలో హోమ్ ఓటింగ్ నూరు శాతం పూర్తయింది. మొత్తం 41 ఓట్లకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇట్ల కిశోర్ ఆధ్వర్యంలో హోమ్ ఓటింగ్ బృందాలు వాహనాల్లో వెళ్లి, ముందుగా నమోదు చేసుకున్న వారి నుంచి ఓటు వేయించుకున్నారు. ఈ ప్రక్రియను ఆర్వో కిశోర్ పర్యవేక్షించారు. రమణయ్యపేటలో ఏపీ ఎస్పీ జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఫెసిలిటేషన్ సెంటరులో ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు.

సజావుగా హోమ్ ఓటింగ్ పూర్తి

కాకినాడ: కాకినాడ సిటీ నియోజకవర్గంలో హోమ్ ఓటింగ్ ప్రక్రియ ఆదివారం సజావుగా పూర్తయింది. 86 ఏళ్ల వృద్ధులు, దివ్యాంగుల కోసం ఆదివారం ఇంటి వద్దకే ఓటు వేసే అవకాశం కల్పించారు. ఈ ప్రక్రియ కింద కాకినాడ సిటీ నియోజకవర్గంలో 43 మందిని గుర్తించారు. వీరిలో ఆదివారం 42 మంది హోమ్ ఓటింగ్ ప్రక్రియను సద్వినియోగం చేసుకున్నారు. ఒకరు ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడంతో పాల్గొనలేకపోయారు. సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు పర్యవేక్షణలో ఐదుగురు రూట్ ఆఫీసర్లు హోమ్ ఓటింగ్ ప్రక్రియను నిర్వహించారు.

సంక్షేమ పాలన చూసి గెలిపించండి

వైఎస్సార్ సీపీ శ్రేణుల ఎన్నికల ప్రచారం



విజయరాయుడుపాలెంలో బ్యాలెట్ నమూనాతో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కరప: పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలన చూసి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులను గెలిపించాలని పార్టీ శ్రేణులు ఆదివారం పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, పార్టీ మేనిఫెస్టోను వివరిస్తూ గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. ఓటర్లకు కరపత్రాలను పంచిపెట్టి, ఫ్యాన్ గుర్తుపై ఓటేసి కాకినాడ రూరల్ అసెంబ్లీ అభ్యర్థి కురసాల కన్నబాబును, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలపించాలని అభ్యర్థించారు. విజయరాయుడుపాలెంలో సర్పంచ్ వెలుగుబంటి సీతారామరాఘవ, మండల జేఎస్‌వీ ఇన్‌చార్జి కాదా వెంకటేశ్వరరావు, జిల్లా ఏఎంసీ సభ్యుడు బొండా చంటిబాబు, ఏఎంసీ డైరెక్టర్ నున్న వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ పేపకాయల పుల్లేశ్వరరావు, మాతా అప్పారావు, బూలా రాజు, ద్రోణం సుధీర్‌కుమార్, పేపకాయలపాలెంలో జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, గొర్రిపూడిలో గ్రామ అధ్యక్షుడు చీకాల సుబ్బారావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చీకాల అప్పలరాజు, కానూరి శ్రీహరి, పుణ్యమంతుల తాతాజీ, ఎర్రంనీడి సుబ్రహ్మణ్యం, పాలాని సోమరాజు, శ్రీపాదం వీరభద్రరావు, ఎర్రంనీడి వెంకటరమణ, కె.శ్రీను, కేతా వెంకటరమణ తదితరులు బ్యాలెట్ నమూనాతో ప్రచారం చేశారు. యండమూరులో పార్టీ గ్రామ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మార్నెళ్ల వెంకటరమణ, నురుకుర్తి వీరన్న, షేక్ దరియా, వనుం రమేష్ పాల్గొన్నారు.

జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువా వేస్తున్న కల్యాణ్ కృష్ణ

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామం బాపన్నదొర కాలనీకి చెందిన పలువురు సినీ దర్శకుడు కల్యాణ్‌కృష్ణ సమక్షంలో ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు కార్యాలయంలో పార్టీ నాయకురాలు రేఖారెడ్డి, కట్టా జగన్‌మోహన్ కిశోర్ ఆధ్వర్యంలో జనసేన యూత్ సభ్యులు సూరంపూడి అఖిల్, నరగన స్వరూప్, కేశనకుర్తి దుర్గాప్రసాద్, కొప్పిశెట్టి భరద్వాజ్, పలివెల కిశోర్‌కుమార్, లొల్ల సత్యమణికంఠ, సాది చందు, నున్నగుప్పల సూర్య తదితరులు 30 మంది పార్టీలో చేరారు. వీరికి పార్టీ కుండువాలు వేసి, కల్యాణ్‌కృష్ణ సాదరంగా ఆహ్వానించారు.

కన్నబాబు భార్య ఎన్నికల ప్రచారం



ప్రచారం చేస్తున్న కన్నబాబు భార్య శ్రీవిద్య తదితరులు

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబుకు మద్దతుగా ఆయన భార్య శ్రీవిద్య, మరదలు చైతన్య, ఇతర కుటుంబ సభ్యులు ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. మహిళలతో కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, వైఎస్సార్ సీపీకి విజయం అందించాలని కోరారు. కాకినాడ అర్బన్ మూడో డివిజన్‌లోని డీ మార్ట్ వీధిలో శ్రీవిద్య తదితరులు ప్రచారం చేశారు.